ఓం హ్రీం శ్రీం

# శ్రీవాసవి కన్యకాదేవి పురాణము

## దశమాధ్యాయము

### వాసవీ విరూపాక్షుల విద్యాపరీక్షలు - కీర్తి ప్రతిష్ఠలు :-

అటుపై భాస్కరాచార్యుని ఆధ్వర్యమున గురుకులవాసములోని శిష్యులందరికి సకలవిద్యలలోను విద్యాపరీక్షలు నిర్వహించబడినవి. వాసవీకన్యక శిల్ప, నృత్య, సంగీత, సాహిత్య, చిత్రలేఖనాది లలితకళలలోను, వివిధ శాస్త్రముల పరిజ్ఞానమునందును, ఆధ్యాత్మిక విద్యయందును, భారతీయ సంస్కృతీ మానబిందువులైన గోవులు, స్త్రీలు, బ్రహ్మనిష్ఠులు, పవిత్ర గ్రంథములు, దేవాలయములు మున్నగువాని సేవాతత్పరతలోను, సాటిలేని మేటి కన్యామణిగ ఎన్నబడినది. విరూపాక్షుడు సమస్త రాజోచిత విద్యలందును, రణవిద్యలలోను ఎదురులేని వీరశిరోమణిగ ఎన్నబడెను. కుసుమశ్రేష్ఠి మహారాజు తమ విశిష్ఠ కులాచారముననుసరించి వాసవీ విరూపాక్షుల గుణకర్మ స్వభావముల కనుగుణ్యముగ కన్యకను "గౌరవ బాలికగను", విరూపాక్షుని బాలనగరుడుగను నొనర్చి సంతసించెను. మహావీరుడైన విరూపాక్షుడు సర్వబాలనగర సైన్యములకు అధిపతియయ్యెను.

గౌరవబాలికయైన వాసవీకన్యక, త్రిలోకైక సౌందర్యరాశిగ రూపొందినది. లలిత కళలయందును, ఆధ్యాత్మిక విద్యావిజ్ఞానమునందును సాటిలేని మేటి విదుషీమణియై అపరసరస్వతిగ కీర్తింపబడసాగినది. ఆ బాలామణి సమస్త ప్రజలకు యిట్లు

బోధింపసాగినది. "సమస్త జీవుల యందున్న ఆత్మ ఒకటియే. అందువలన మానవులు తమను తాము ప్రేమించి సేవించుకొనునట్లు సర్వజీవులను ప్రేమించి సేవించుచుండవలెను. సర్వులను సమదృష్టితో చూడవలయును. సమత్వమే యోగమనబడును. కామమే సర్వదుఃఖములకు మూలము. కనుక మానవులు కామమున తద్జాతమగు క్రోధమును జయించవలెను. ప్రతివ్యక్తియు ఇంద్రియ నిగ్రహము కలిగియుండవలెను. నిర్భయము, ఆత్మాభిమానము, కార్యదీక్ష కలిగి యుండవలెను. మానవుని యందు సత్యము, శాంతము, కరుణ, అహింస, త్యాగములను ఐదును పంచప్రాణములవలె విలసిల్లవలెను. ప్రతివారును చతుర్విధ పురుషార్థములను సాధించుచు ఋణత్రయవిముక్తులై మోక్షసామ్రాజ్యము పొందుటకు నిరంతరము ప్రయత్నించవలెను."

శ్రీ వాసవీకన్యక యిట్లు జ్ఞానబోధలను గావించుచు దీనదుఃఖితులను సేవించుచు అహర్నిశలు ఆదిపరాశక్తియగు వింధ్యవాసినీదేవి నారాధించుచు ఆదర్శగౌరవబాలికామణి అనుకీర్తిని ఆర్జించినది. ఆమె యొక్క హస్త స్పర్శ కలిగినంత మాత్రముననే వ్యాధిగ్రస్తులకు రోగములు శమించుచుండెను. గ్రుడ్డి వారికి చూపు లభించుచుండెను. వికలాంగులకు వికలత్వము దూరమగు చుండెను. ప్రజలు శ్రీవాసవీ బాలికను పరాంబికావతార రూపిణిగ భావించి భక్తితో గౌరవింపసాగిరి.


ఇపుడు పద్మశయన పురాధీశ్వరుడగు విష్ణువర్ధన చక్రవర్తి యొక్క పూర్వజన్మల వృత్తాంతమును అటుపై అతని వంశక్రమమును వినుడు.

## విష్ణువర్ధనుని వృత్తాంతము :-

"ఓ వైశ్య సుధీమణులారా! పూర్వము ఈశ్వరుని కంటిమంటచే దహింపబడిన మన్మథుని చితాభస్మమునుండి భండాసురుడను రాక్షసుడుద్భవించెను. కాముని

శరీరభస్మము నుండి ప్రభవించిన కారణమున ఆ భండాసురుడు రూపుదాల్చిన కామప్రవృత్తిగ విజృంభించి పరమదుష్టుడయ్యెను. ఆ భండాసురుడా పరాశక్తిచే సంహరించబడెను. అటుపై అతడే చిత్రకంఠుడను గంధర్వరాజుగానుద్భవించి కైలాసమున పరశక్త్యావతారయై ప్రభవించిన కీర్తికన్యకను కామించినవాడై వైశ్యులచే శాపము నొంది కలియుగమున చంద్రవంశమునందు విజయాఖ్య మహారాజునకు విష్ణువర్ధనుడను పేర జన్మించి రాజ్యమును పొందెను. అతని వంశక్రమమును గూర్చివినుడు.

పాండవం మధ్యముడై జగత్ప్రసిద్ధిగాంచిన అర్జనుని కుమారుడు అభిమన్యుడు ఆ అభిమన్యుని భార్యయగు ఉత్తరగర్భమున పరీక్షిత్తుడను కీర్తిమంతుడుదయించెను. అరుణోదయ కాలమున కరగి దూరముగ పారు మంచువలె పరీక్షిత్తు పాలనలో కలిపురుషుడు పారిపోయెను. అట్టి పరీక్షిత్తుడు జనమేజయుడను ఉత్తమతనయుని పొందెను. తరువాత ఆ వంశమునందు అనేకమంది రాజులు ప్రభవించి గతించిరి. తదుపరి విజయాఖ్యుడను మహీపాలుడుద్భవించెను. ఆ విజయాఖ్యునకు, భండాసురాంశజుడైన నాటి చిత్రకంఠుడను గంధర్వుడే విష్ణువర్ధనుడను పేర జన్మించెను. అతడు సకల శాస్త్రములను, ధనుర్వేదమును అరువది నాలుగు విద్యలను అభ్యసించినవాడైనను గతజన్మల వాసనల కారణమున అమితధనాశాపరుడును మరియు కాముకుడునునయ్యెను. అతడు మిక్కిలి బలవంతుడు, మహావీరుడగు కూడా నయ్యెను. పద్మశయన పురమును రాజధానిగ చేసుకొని చక్రవర్తియై వేంగీసామ్రాజ్యమును పాలించసాగెను. వైశ్యరాజ్యము వేంగీ సామ్రాజ్య చక్రవర్తులకు సామంత రాజ్యముగ విలసిల్లు చుండెను.



రాజ మహేంద్రవరం చక్రవర్తి విష్ణువర్ధన మహారాజు పెనుగొండకు
విచ్చేసిన సందర్భముగా కుసుమాంబ వాసవి రాజ పరివారమును స్వాగతించుట

## విష్ణువర్ధనుని దిగ్విజయ యాత్ర - పెనుగొండకు వాని రాక :-

విష్ణువర్ధన సార్వభౌముడు ఒకప్పుడు తనకుమారుడైన రాజేంద్రుని పద్మశయనములో నిలిపి, దిగ్విజయ యాత్రలకై బయలుదేరెను. అతడు చతురంగములతో కూడిన మహాసైన్యసమేతుడై నాలుగుదిక్కులలో గల రాజన్యులను ఓడించుచు, దుర్గములను జయించుచు, ఓడిన రాజులచేత ఒసగబడిన అమేయ సంపదలను, రత్నరాశులను తీసుకొని విజయశీలుడై తిరుగు ప్రయాణము చేయనారంభించెను. విష్ణువర్ధనుడు విజయగర్వముతో సైన్యసమేతుడై స్వీయనగరమునకు తిరిగివచ్చుచు మార్గమధ్యమున వైశ్యరాజధానియైన పెనుగొండ పట్టణమును తిలకించెను. రత్నమయధ్వజ పతాకములతో విరాజిల్లు భవనములు, మణిమయతోరణములు, ఆకాశము నంటుచున్న ప్రాకార శిఖరములు, పాతాళమంత

లోతుగల అగడ్తలు, స్ఫటిక మణిమయములైన కోటబురుజులు, నందనవనమును మరపింపజేయు అందమైన ఉద్యానవనములు కలిగి సర్వాంగసుందరమై ప్రకాశించుచు, మహీకంఠహార మణిమేఖలవలె ఆ పెనుగొండ పట్టణము అలరారుచుండెను. చక్రవర్తి ఆగమనమును చారులవలన కుసుమశ్రేష్ఠి తెలిసికొనెను. అతని ఆజ్ఞచేత అమాత్యశేఖరులు వీధులలో పన్నీరు చల్లించిరి. ముత్యాలతో ముగ్గులు తీర్పించిరి. కాంచన మణిమయతోరణములతో నగరమును అలంకరింపజేసిరి. కస్తూరి కర్పూరాది సుగంధద్రవ్యములను, చీనిచీనాంబరములను, పలువిధ రత్నరాశులను కానుకలుగ తీసుకొనివెళ్లి సార్వభౌమునకు సమర్పించిరి. అంజలి ఘటించి "ఓ ప్రభూ! మీ ఆగమనము వలన మా పట్టణము పావనమైనది. మా నగరములోనికి దయచేయుడు" అని ఆహ్వానించిరి. విష్ణువర్ధనుడు వారి స్వాగతమునకు సంతోషించి సపరివారముగ పెనుగొండ నగరప్రవేశము గావించెను. మేళతాళములతో వారాంగనల నృత్యగీతములతో, మంగళ నీరాజనములతో కుసుమశ్రేష్ఠి చక్రవర్తికెదురేగి వారిని తోడ్కొనివచ్చి, ఇంద్ర భవనమువంటి సువిశాల సుందర భవనమున విడిది చేయించెను. నగరమునకు తూర్పునగల పెద్ద మైదానములో చక్కని గుడారములు వేయించి తక్కిన సైన్యపరివారములన్నింటికి వసతి సౌకర్యములు కల్పించెను.

విష్ణువర్ధనునకు వైశ్యుల వైభవము విస్మయము కలిగించినది. విడిది భవనపు అందచందములు, తనపై వైశ్యులు చూపిన ఆదరాభిమానములు అతనిని ఎంతగనో అలరించినవి. నాటి సాయంత్రమున విడిది సౌధోపరిప్రాంగణమున చక్రవర్తియు ప్రధానమంత్రులును, కుసుమాచార్యుని అమాత్యశేఖరులును, సముచితాసనములపై ఆసీనులై దిగ్విజయ యాత్రావిశేషములను గూర్చి సంభాషించుకొనసాగిరి. ఇంతలో వాసవీకన్యక సర్వాలంకారభూషితమై తన చెలులతో గూడి వైశ్యరాజ ప్రాసాదము నుండి వెలువడి, మంగళతూర్యములు మారు మ్రోగుచుండగ వింధ్యవాసినీ దేవీ పూజకై

దేవాలయమునకు బయలుదేరినది. మంగళ తూర్యమధుర స్వరములచే ఆకర్షితుడైన విష్ణువర్ధన చక్రవర్తియు తదితరులును ఆవైపునకు చూడగ తటిల్లతవలె మెరసిపోవుచున్న వాసవీకన్యక చక్రవర్తి కనులకు కనిపించినది. చుక్కలలో చంద్రునివలె ప్రకాశించుచున్న ఆ కన్యక చక్కదనము విష్ణువర్ధన చక్రవర్తి హృదయమునకు చక్కిలిగింతలు పెట్టినది. అతడు ఆశ్చర్యమగ్నమానసుడై అక్కడివారికి వాసవీకన్యకను చూపించుచు "ఓ ఆత్మీయులారా! నేను దిగ్విజయ యాత్రగావించుచు యీ అనంత భూమండలమును చుట్టి వచ్చితిని. కాని ఇంతటి సౌందర్యరాశిని ఎక్కడను చూడలేదు. మెరపుతీగెయే స్త్రీ రూపమును ధరించి యీ మేదినిపై సంచరించు చున్నది కాబోలు. త్రిజగన్మోహన రూపిణియైన యీకన్యక ఎవరు? నేలపై నడయాడ వచ్చిన దేవకన్యయా! కాకున్న మానవకాంతకు యిట్టి అతిలోక సౌందర్యమబ్బుట అసంభవము కదా. ఈ తరుణీలలామ యెవరో తెలియజేయుడు" అని ప్రశ్నించెను.

అంతట అక్కడనున్న వైశ్యామాత్యులు "సార్వభౌమా! యీ కన్యక యీ మహారాజైన కుసుమ శ్రేష్ఠి యొక్క కుమార్తె, పుత్రకామేష్ఠి వలన పరమేశ్వరీ అనుగ్రహముతో జన్మించిన వరపుత్రిక, జగద్విఖ్యాత వీరకుమారుడైన విరూపాక్షుని సహోదరి" అని వాసవీకన్యకను గూర్చి వివరించిరి. విషయము తెలుసుకున్న విష్ణువర్ధన చక్రవర్తి వారికి సెలవిడి ఏకాంతమును పొంది మదన బాణపీడితుడై, విరహానల సంతుప్తుడై మ్రగ్గసాగెను.

## వివాహమునకై రాయబారము :-

అంతట విష్ణువర్ధనుని అమాత్యులు వైశ్యామాత్యులను జూచి "ఓ మంత్రి వర్యులారా! చంద్రవంశముతోడి సంబంధము మీగత జన్మార్జిత పుణ్యఫలముగ భావింపుడు. ఇది ధర్మవిరుద్ధముకాదు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రులలో బ్రాహ్మణునకు నాలుగు వర్ణములయందు వివాహము యోగ్యమగుచున్నది. క్షత్రియులకు



మోహపరవశుడైన విష్ణువర్ధన మహారాజు కుసుమ శ్రేష్ఠి వాసవీ కన్యను ఇచ్చి వివాహము చేయమని మంత్రులకు ఆదేశించుట

వర్ణత్రయముతో సంబధము యుక్తమగుచున్నది. శూద్రునకు తనజాతియందే బంధుత్వం చెప్పబడినది. ఇట్లెన్నో వివాహములు పూర్వము చేయబడినవి." అని పలికిరి. అంత కుసుమార్యుని సచివోత్తముడైన ధనదార్యుడు "ఓ సార్వభౌముని మంత్రివర్యులారా! మీరు యుగధర్మముల నెఱుగనివారు కారు. మీరు చెప్పిన ధర్మములు మనుధర్మశాస్త్రము చేత విధించబడినవి. కాని కలియుగమున మనుస్మృతి అనుసరణీయముకాదు. ఈ యుగములో అనుసరణీయమైనది పరాశరస్మృతి, దానియందు అనులోమ విలోమ వివాహములు నిషేధించబడినవని పెద్దలకు తెలియనది కాదు." అని సమాధానము చెప్పెను.

అంత కుసుమార్యుని యితర మంత్రులు చక్రవర్తి యొక్క అమాత్యులను జూచి ఓ అమాత్యశేఖరులారా! వర్ణాంతర వివాహములు మా కులాచారమునకు విరుద్ధములు. వివాహ విషయములో వధూవరుల అభిప్రాయములకు సంపూర్ణమైన విలువనిచ్చుట మా

సంప్రదాయము. అంతియేగాక మా రాకుమారి గౌరవ బాలిక. మా వర్ణములోని గౌరవ బాలికలు వివాహమును ఇచ్ఛగించనిచో వారిని బలవంతపెట్టము. అట్టి కన్యలు ఒకవేళ వివాహమును వాంఛించినను వైశ్యయువకులలో బాలనాగరుడైన వానికి మాత్రమే ఆమెనిచ్చి వివాహము చేయవలెనను కట్టుబాటుమాకున్నది. ఇకమీ చక్రవర్తి కోరిక తీరుట యెట్లు సాధ్యము కాగలదు?" అని ప్రశ్నించిరి. ఇట్లు ఉభయ పక్షముల వారికి వాదోపవాదములు జరిగినవి - విష్ణువర్ధనుని మంత్రులు మిక్కిలి కోపించి "ఓ వైశ్యులారా! మీకు చక్రవర్తి బలాధిక్యత తెలియుటలేదు. విష్ణువర్ధన సార్వభౌమునకు శత్రువులై మీరేవిధముగ జీవించగలరో చూచెదము" అని బెదిరించి అటనుండి తమ ప్రభువుకడకు వెడలిపోయిరి.


## వైశ్యమంత్రులు విష్ణువర్ధనుని సమాధానపరచి పంపుట :-

తన మంత్రులద్వార, జరిగిన ఉదంతమును విన్న కుసుమ శ్రేష్ఠి వారితో "ఓ సచివోత్తములారా! మీరు చతురతతో ప్రవర్తించి, ఆ చక్రవర్తిని సామముతో యొప్పించి ప్రస్తుతము అతడు మన నగరమును వీడిపోవునట్లు చేయుడు. అటుపై మన సమస్త బంధువర్గముతో సమాలోచనము సలిపి యీ సమస్యను పరిష్కరించుకొందుము" అని చెప్పి వారిని పంపించెను. ఇంతలో, జరిగిన విషయములను వినిన చక్రవర్తి వైశ్యామాత్యులను తన యొద్దకు బిలిపించుకొని, వారిని సత్కరించి, "ఓ వైశ్యోత్తములారా! నేను వాసవిని తప్పక వివాహమాడ గోరుచున్నాను. మీరు కన్యనీయ నిరాకరించినతో బలవంతముగనైన నేనామెను పరిగ్రహించెదను." అని చెప్పెను.

అంతవారు చక్రవర్తితో "మహాప్రభూ! మా వంశమున కులాచారములను ఉల్లంఘించుటకు ఎవ్వడును సమర్థుడుకాడు. కులమంతటికిని సంబంధించిన సంప్రదాయములు అతిక్రమించు సమయమున కులపతియైన మా రాజు స్వతంత్రించుట



మోహపరవశుడైన విష్ణువర్ధన మహారాజు కుసుమ శ్రేష్ఠి వాసవీ కన్యను ఇచ్చి
వివాహము చేయమని మంత్రులకు ఆదేశించుట



కుసుమాంబ కుసుమ శ్రేష్ఠికి సుపుత్ర రత్నమైన వాసువాంబకు విష్ణువర్ధన మహారాజు కోరికను విశదీకరించుట

సముచితము కాదు. అందువలన పదునెనిమిది పట్టణముల యందున్న అశేషబంధు ప్రతినిధులను పిలిపించి వారి అనుగ్రహమును పొంది విధిపూర్వకముగ వివాహము చేయదగియున్నది. కావున మేము వైశ్యసభ గావించి ఆ సభా నిర్ణయములననుసరించి యీ సమస్యను పరిష్కరించగలము. కనుక తమరిపుడు మా రాజగృహములో విందును స్వీకరించి స్వీయ నగరమునకు తరలి వెళ్లవలసినదిగ మనవి." అని వినయముతో విన్నవించిరి. వైశ్యుల పలుకులను విన్న విష్ణువర్ధన చక్రవర్తి ప్రీతచిత్తుడై వాసవిని పొందగలనను సంతోషముతో భోజనమునకు సమ్మతించి ఆ వైశ్య ముఖ్యులను నిజనివాసములకు పంపించి మన్మథ బాధితుడై తనబసలో నుండెను.

అనంతరము, జరిగిన ఉదంతమును గూర్చి విన్న భాస్కరాచార్యుడు ఉచితాను చితములను ఆలోచించి బాలనగరులను బిలపించి వారికి కర్తవ్యమును బోధించి చక్రవర్తి చెంతకు పంపించెను. అపుడా బాలనగరులు సార్వభౌముని వద్దకు పోయి వినయవినమిత శిరస్కులై నమస్కరించి "ఓ రాజాధిరాజా! మాకులమందు వివాహమునకు ముందు కన్యదాత గాని, కన్యాపరిగ్రహీతగాని ఒకరి యింట ఒకరు భోజన ప్రతిభోజనములను చేయరాదు. ఆ విధముగ చేసినచో ఆ సంబంధము ఘటించదు. ఈ కులమర్యాదను తమకు తెలియజేయుటకై మాగురువరేణ్యుడు మమ్ములను తమ సన్నిధికి పంపించినారు. కనుక తమరు అన్యధా భావించక తమ పట్టణమునకు పోయి పక్షము తరువాతరండు" అని విన్నవించిరి. ఆ బాల వైశ్యుల వచనములను విని రారాజు ఏమి చేయుటకును తోచనివాడై వారికి సెలవొసగి పంపి సందిగ్ధమానమానసుడయ్యెను.

అంతట తన సేనాధిపతియు, మంత్రియునైన విక్రమకేసరిని పిలిచి "ఓ విక్రమకేసరీ! మేము రాజధానికి తరలివెళ్లుచున్నాము. నీవు చాలినంత సైన్యముతో



వైశ్యమహాసభ పెండ్లికి నిరాకరించిన విషయము తెలిసి బలాత్కారముగా నైనను వాసవిని బంధించి తీసికొని రావలయునని సేనాధిపతికి ఆజ్ఞ నొసంగుట.

ఇక్కడనే వుండి యీ వైశ్యుల కార్యకలాపములను గమనించు చుండుము. వారియందు ఏదైన ద్రోహచింత పొడసూపిన యెడల భేదోపాయముతో వాసవిని బంధించి తీసుకొని రావలయును. జాగరూకుడవై వర్తించుము." అని ఆజ్ఞాపించెను. అటుపై స్వస్థమనస్కుడై రారాజు సమస్త సైన్యములను తోడ్కొని స్వీయనగరమునకు ప్రయాణమై పోయెను. అతడు సదా వాసవీకన్యకను సంస్మరించుచు దినములు లెక్క పెట్టుకొనసాగెను. ఆహారనిద్రలను, తదితర భోగములను పరిత్యజించి విరహవేదనతో క్షణములు యుగములుగ గడుపసాగెను.